క్లుప్తంగా

క్రీడల్లో సత్తా చాటాలి



క్రీడా సామగ్రి అందజేస్తున్న బొంబాయి రమేష్ నాయుడు

యాడికి: ఈనెల 24 నుంచి 30 వరకూ జరగనున్న ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఎంఈఓ కాశెప్ప సూచించారు. సోమవారం ఎంపీడీఓ సమావేశ భవనంలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన మండలంలోని క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేశారు. మండలం నుంచి కబడ్డీ బాలుర విభాగంలో యాడికి నం–2 సచివాలయం జట్టు, క్రికెట్‌లో యాడికి నం–1 సచివాలయం జట్టు, వాలీబాల్‌లో యాడికి నం–4 సచివాలయం జట్టు, బాల్‌బ్యాడ్మింటన్‌లో రాయల చెరువు నం:2 సచివాలయం జట్టు, ఖోఖోలో యాడికి నం–4 సచివాలయం జట్టు, ఖోఖో బాలికల విభాగంలో రాయలచెరువు నం–1 సచివాలయం జట్టు, వాలీబాల్‌లో కమలపాడు సచివాలయం జట్టు, షటిల్‌లో చందన సచివాలయం జట్లు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీడీఓ కార్యాలయ అధికారి రాజశేఖర్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోండి



అధికారులతో చర్చిస్తున్న డీఎల్‌డీఓ ఓబుళమ్మ

యల్లనూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం డీఎల్‌డీఓ ఓబుళమ్మ అన్నారు. సోమవారం మండలంలోని బుక్కాపురం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ శాఖ తరఫున డ్రోన్ సహాయంతో మందులను పిచికారీ చేసే విధానాన్ని రైతులకు క్షేత్రస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగాదేవి, ఎంపీడీఓ వీరరాజు, అగ్రికల్చర్ ఆఫీసర్ రామకృష్ణుడు, వైద్యురాలు కీర్తన, పీఆర్ జేఈ నరేంద్ర, ఏపీఓ షబ్బీర్‌బాషా, హౌసింగ్ ఏఈ సుప్రజ, టీఏ శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు చింతల రాయుడు, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న 12 విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చెందిన పైలాగ్ కంపెనీ వారు సోమవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. మెకానికల్, ఈఈఈ విభాగాల నుంచి 47 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. కంపెనీ ప్రతినిధులు పార్థసారథి, షాహిద్ అహ్మద్ ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ద్వారా 12 మందిని ఎంపిక చేసి, ఆఫర్ లెటర్స్ అందజేశారన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో హైదరాబాద్ మెయిన్ బ్రాంచ్‌లో చేరవచ్చని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

కానిస్టేబుల్‌కు గాయాలు

యల్లనూరు: యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నవీన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. సీఎం బందోబస్తు విధుల్లో ఉన్న కానిస్టేబుల్ నవీన్.. ద్విచక్రవాహనంలో ఉరవకొండకు బయలుదేరారు. ఉరవకొండ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో గాయపడినట్లు తోటి కానిస్టేబుళ్లు తెలిపారు. చికిత్స నిమిత్తం అతడిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ధరణి బాబు, తాడిపత్రి పట్టణ ఎస్ఐ రామకృష్ణ ఘటనపై ఫోన్‌లో ఆరా తీశారు.

గుత్తి సెబ్ సీఐగా శివసాగర్



గుత్తి: గుత్తి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐగా శివసాగర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేస్తున్న వరలక్ష్మిని అనంతపురం వీఆర్‌కు బదిలీ చేయడం జరిగింది. వాయల్పాడులో సెబ్ సీఐగా పని చేస్తున్న శివసాగర్‌ను గుత్తికి బదిలీ చేశారు.

శింగనమల సీఐగా శ్రీధర్

శింగనమల: శింగనమల సీఐగా శ్రీధర్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ అన్సార్ బాషా తిరుపతికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తదితరులు సీఐ శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు.

మార్మోగిన రాములోరి నామస్మరణ



గార్లదిన్నె: ఎగువపల్లిలో జ్యోతులతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



తాడిపత్రి అర్బన్: పట్టాభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు



గుంతకల్లు టౌన్: శ్రీరాముడి కటౌట్ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్



పుట్లూరు మండలం ఎల్లుట్లలో..



కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరాముడి పట్టాభిషేకం



తాడిపత్రి అర్బన్: శ్రీరాముడికి పట్టాభిషేకం చేస్తున్న పండితులు

జై శ్రీరామ్ నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. సోమవారం గుంతకల్లు, శింగనమల, తాడపత్రి నియోజకవర్గాల్లో అయోధ్య రామజన్మ భూమిలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. కోదండ రామ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వందలాది మందికి భోజన వసతి కల్పించారు. మెయిన్ రోడ్డు నామాల సేట్ దుకాణ యజమాని ఏర్పాటు చేసిన శ్రీరాముడి భారీ కటౌట్–సెల్ఫీ పాయింట్ ఆకట్టుకుంది. పలుచోట్ల విగ్రహ ప్రతిష్ఠ ప్రసారానికి భారీ ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేయడంతో వీక్షించేందుకు జనం బారులు తీరారు. తాడిపత్రి మండలం ఆలూరు కోన రంగనాగనాథ స్వామి ఆలయం, గుంతకల్లు మండలం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీరాముడి పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. కసాపురం గ్రామంలో బెస్త సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. గుత్తిలో ఆర్యవైశ్య, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. యాడికి మెయిన్ బజారులో రాములోరి జెండాలతో ఆలయాల కమిటీ సభ్యులు, హిందూ దార్మిక సంస్థల సభ్యులు పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. చందనలో సీతారాముల, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో కొలువుదీర్చి గ్రామోత్సవం చేపట్టారు. తాడిపత్రి పట్టణంలోని గాంధీకట్ట వద్ద జైశ్రీరామ్ భక్తమండలి అధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకాన్ని నిర్వహించారు. మెయిన్ బజార్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీసీతారామ కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. విజయనగర్ కాలనీలో, నంద్యాల రోడ్డు, పంచముఖి ఆంజనేయస్వామి, గన్నెవారిపల్లి కాలనీ, పుట్లూరు రోడ్డు, ఆర్వీస్వామి కళ్యాణ మండపాల్లో కళ్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. చింతల వెంకటరమణస్వామి ఆలయంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకం జరిపించారు. అలాగే పామిడి, శింగనమల, గార్లదిన్నె, పుట్లూరు, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల్లో రాముడి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు జరిగాయి. – సాక్షి నెట్‌వర్క్:



తాడిపత్రి టౌన్: శ్రీరాముడి చిత్రపటానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పెద్దపప్పూరులో భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్తులు



పామిడి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో పూజలు



పెద్దవడుగూరు: మొలకతాళ్లలో భజన



శింగనమలలో భక్తుల సందడి



యాడికి మండలం కేశవరాయుని పేటలో శ్రీరాముడి గ్రామోత్సవం



గుత్తి: చెట్నేపల్లి రాముడి ఆలయంలో పూజలు

సీఎం సభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి

గుంతకల్లు: మహిళా అభ్యున్నతే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం గుంతకల్లులో ఐటీ విభాగం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉరవకొండకు రానున్నారని తెలిపారు. వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత నిధులను జమ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, షావలి, భార్గవ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సేవలో డీఆర్ఎం వినీత్ సింగ్

గుంతకల్లు రూరల్: గుంతకల్లు డీఆర్ఎంగా బాధ్యతలు స్వీకరించిన వినీత్‌సింగ్ సోమవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న డీఆర్ఎం వినీత్ సింగ్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు డీఆర్ఎంకు ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

గడ్డివాముల దగ్ధం

యాడికి: వి.కొట్టాలపల్లెలో సోమవారం రాత్రి 9 గంటల సమయంలో 4 గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వి.శంకర్ రెడ్డి గ్రామ సమీపంలో గల కల్లం దొడ్డిలో రెండు ట్రాక్టర్ల సొప్ప, రెండు ట్రాక్టర్ల వరి గడ్డితో ఇటీవల వాము వేసుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టారు. ఒక్కసారిగా మంటలు రావడంతో గ్రామస్తులు ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చారు. తాడిపత్రి ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పేలోపు గడ్డి కాలిపోయింది. రూ.60 వేల వరకూ నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తాడిపత్రిటౌన్: యర్రగుంటపల్లి సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



పెద్దపప్పూరు: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని సన్మానిస్తున్న రైతులు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముచ్చుకోట, అమ్మలదిన్నె, సోమనపల్లి గ్రామాల్లో పర్యటించారు. నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు ఎంపిక చేసిన వారికి మాత్రమే పథకాలు అందేవని తెలిపారు. అయితే జగన్ పాలనలో ఎలాంటి రాజకీయ పలుకుబడి లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతుందన్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరిస్తానని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ముచ్చుకోట, చాగల్లు, పెండేకల్లుకు 2021 నుంచి వరుసగా నీరు విడిపించడంతో వేలాది బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరిగాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎదుట రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకుంటామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య) వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమర్‌నాథ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు హాజీవలి, సర్పంచులు గౌతమి, రమేష్ నాయుడు, వెంకటరాముడు, ఎంపీటీసీలు మల్లేశ్వరి, నారాయణ, అనిల్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామూర్తి రెడ్డి, జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, నామనాంకపల్లి రఘునాథ రెడ్డి, ఆయా గ్రామాల స్థానిక నేతలు జనార్దన్ రెడ్డి, బాలకృష్ణా రెడ్డి, జయరామిరెడ్డి, యోగీశ్వర్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, శివశంకర్ రెడ్డి, ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు అశ్వత్థం ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటి ముంగిటికే ప్రభుత్వ సేవలు

తాడిపత్రిటౌన్: ఇంటి ముంగిటికే ప్రభుత్వ సేవలు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని యర్రగుంటపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత గ్రామాల్లోనే సచివాలయాలు, ఆర్‌బీకేలు వంటి పలు భవనాలు ఏర్పాటు చేసి ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నేడు పింఛన్ల కోసం వృద్ధులు ఇబ్బందులు పడే దుస్థితి లేదన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణమ్మ, ఆలూరు రామేశ్వరెడ్డి, ఎంపీటీసీ కిశోర్ రెడ్డి, సూర్యనారాయణ, దస్తగిరి, ఆయూబ్, నాగేశ్వరెడ్డి, బాణా రాఘవరెడ్డి, గాలి శ్రీనివాసరెడ్డి, క్రిష్ణయ్య, నారాయణ స్వామి హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె విరమణ



ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారికి జాయినింగ్ రిపోర్టు అందిస్తున్న యాడికి అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు శుక్రవారం విధుల్లో చేరారు. మండల వ్యాప్తంగా 295 మంది కార్యకర్తలకు గాను 294 మంది విధుల్లో చేరినట్లు సూపర్‌వైజర్లు తెలిపారు. తేరన్నపల్లి అంగన్‌వాడీ కార్యకర్త వ్యక్తిగత కారణాలతో విధుల్లో చేరలేదని తెలిపారు. అలాగే మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న దాదాపు 258 మంది ఆయాలు విధుల్లో చేరినట్లు వెల్లడించారు.

యాడికి/తాడిపత్రి అర్బన్: యాడికి మండలంలోని 68 కేంద్రాల అంగన్‌వాడీ వర్కర్లు, 48 మంది ఆయాలు దీక్షలు విరమించారు. సోమవారం తాడిపత్రి ఐసీడీఎస్ కార్యాలయంలో యాడికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారికి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. తాడిపత్రి సీడీపీఓ కార్యాలయంలో పలువురు అంగన్‌వాడీలు విధుల్లో చేరుతున్నట్లు సూపర్‌వైజర్ దస్తగిరమ్మకు జాయినింగ్ రిపోర్టులు అందజేశారు.

పెద్దవడుగూరు: మండలంలో 58 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వాటిలో 54 సెంటర్లలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధుల్లో చేరినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి తెలిపారు. మిగిలిన వారి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు.

గుత్తి: గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల్లోని మొత్తం 269 మంది అంగన్‌వాడీలు, 269 మంది ఆయాలు సమ్మె విరమించారు. ఈ మేరకు విధుల్లో జాయిన్ అవుతున్నట్లు సీడీపీఓ ఢిల్లీశ్వరికి జయినింగ్ లెటర్లు అందజేశారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



వేణు



గాయత్రి



జ్యోతిర్మయి

పామిడి: పట్టణంలో టీసీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం కే రామ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ నెలలో జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో కె.గాయత్రి, ఎండీ జ్యోతిర్మయి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు.


బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రేగడి కొత్తూరు పాఠశాలలో చదువుతున్న గోవిందపల్లికి చెందిన బండారు వేణు ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షలో సత్తా చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారామిరెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా వేణు ఒక్కడే ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడని పేర్కొన్నారు.




ఉపాధ్యాయులతో విద్యార్థులు షామీర్ వలి, ఇమామ్ హుస్సేన్, సంజయ్‌కుమార్

గార్లదిన్నె: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతున్న షామీర్ వలి, ఇమామ్ హుస్సేన్, సంజయ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు



బయోకెమిస్ట్రీ అనలైజర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్



ట్రాక్టర్లకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి సామాన్యుడికి సైతం ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏపీఎంఎస్ఐడీసీ నిధులు రూ.18 లక్షలతో కొనుగోలు చేసిన ఫుల్లీ ఆటోమెటిక్ బయోకెమిస్ట్రీ అనలైజర్‌ను ప్రారంభించారు. పేదలకు ఉచితంగా సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అధునాతన బయోకెమిస్ట్రీ అనలైజర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వాస్పత్రిలో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

నాలుగు కొత్త ట్రాక్టర్ల ప్రారంభం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శివారు కాలనీ ప్రజలకు నీటి సరఫరా చేయడంతో పాటు చెత్తసేకరణకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.38 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన నాలుగు కొత్త ట్రాక్టర్లను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని ప్రారంభించారు. సోమవారం పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పూజలు చేసి, ట్రాక్టర్లను నడిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున, అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఎంఈ గురప్పయాదవ్, ఆర్ఓ నాసిర్‌హుసేన్, ఏసీపీ అబ్దుల్‌సత్తార్, మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు, కౌన్సిలర్ సుధాకర్, కో–ఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్ మాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, వేణుగోపాల్‌రెడ్డి, మెప్మా టీపీఆర్ఓ మోహన్ పాల్గొన్నారు.

డీఆర్ఎంలను కలిసిన ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: బదిలీ వెళ్తున్న డీఆర్ఎం మనీష్ అగర్వాల్, నూతన డీఆర్ఎం వినీత్ సింగ్‌ను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం డీఆర్ఎం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో డీఆర్ఎంలను సన్మానించారు. ధర్మవరం ఎల్‌సీ వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి కృషి చేయడంతో పాటు కసాపురం రైల్వే వంతెన మోరీ విస్తరణ విషయమై రైల్వే బోర్డుకు తీసుకెళ్లడం తదితర పనులకు సహకరించిన డీఆర్ఎం మనీష్ అగర్వాల్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీఎం భాషా, రవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊరి జాతరకు హాజరైన ఎమ్మెల్యే

గుత్తి రూరల్: మండల పరిధిలోని జక్కలచెరువు గ్రామంలో పెద్దమ్మ, సుంకలమ్మ తల్లి ఊరు జాతరకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. సర్పంచ్ సుహాసిని, మాజీ ఎంపీటీసీ రాజన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వైవీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. పెద్దమ్మ, సుంకలమ్మ ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, వైసీపీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మండల, పట్టణ కన్వీనర్లు గోవర్ధన్ రెడ్డి, హుస్సేన్ పీరా, మాజీ జెడ్పీటీసి ప్రవీణ్ కుమార్ యాదవ్, వైసీపీ సీనియర్ నాయకులు గురుప్రసాద్ యాదవ్, రామాంజనేయులు, రామ రంగా రెడ్డి, గోపాల్ రెడ్డి, సచివాలయాల కన్వీనర్ రంగస్వామి, కౌన్సిలర్లు వరదరాజులు, నరేష్, రంగయ్య యాదవ్, నారాయణస్వామి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ: వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం

పెద్దవడుగూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో పెద్దవడుగూరుకు చెందిన సురేష్ మృతి చెందాడు. వివరాలు.. సోమవారం సురేష్, శ్రీకాంత్ ఆచారి ఇద్దరూ ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలుదేరారు. పెద్దవడుగూరు మండల పరిధిలోని గుత్తి అనంతపురం సమీపంలో వీరి వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గాయపడిన ఇద్దరినీ అనంతపురం తరలించారు. చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు.

శింగనమల ఓటర్లు @ 2,45,625



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి

శింగనమల: శింగనమల నియోజకవర్గంలో 2,45,625 మంది ఓటర్లు ఉన్నట్లు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాను విడుదల చేశారు. అందులో పురుషులు 1,22,341 మంది, మహిళలు 1,23,257 మంది, ఇతరులు 27 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. గార్లదిన్నె మండలంలో 45,291 మంది ఉండగా.. పురుషులు 22,506 మంది, మహిళలు 22,776 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. శింగనమల మండలంలో 33,825 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 16,760 మంది, మహిళలు 17,061 మంది, ఇతరులు 4 మంది ఉన్నారు. ఇక బుక్కరాయసముద్రం మండలంలో 59,710 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 29,465 మంది, మహిళలు 30,235 మంది, ఇతరులు 10 మంది ఉన్నట్లు తెలిపారు. నార్పల మండలంలో 46,548 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 23,262 మంది, మహిళలు 23,283 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. పుట్లూరు మండలంలో 30,932 మంది ఉండగా, అందులో 15,611 మంది పురుషులు, 15,321 మంది ఉన్నారు. యల్లనూరు మండలంలో 29,319 మందిలో పురుషులు 14,737 మంది, మహిళలు 14,581 మంది, ఇతరులు 1 ఉన్నట్లు తెలిపారు. ఓటరు లిస్టులను ప్రతి బీఎల్‌వోల వద్ద ఉంచినట్లు వెల్లడించారు. ఓటరు లిస్టులో పేర్లను పరిశీలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

పామిడి: పాళ్యం పెన్నానదిలో సోమవారం వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు సమక్షంలో బోరు వేయించారు. నీరు సమృద్ధిగా పడటంతో రూ.1.50 లక్షలతో మోటార్ బిగించి, పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి తాగునీటి సమస్య తీర్చారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.